సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



మార్పులు.. చేర్పులు
ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో మార్పులు చేర్పులు జరిగాయి. నాలుగు కొత్త కార్యాలయాలు వచ్చాయి. - 8లో



అనుమానాస్పద మృతి
లావేటిపాలెంలో ఓ యువకుడు రైలు పట్టాల పై విగతజీవిగా కనిపించాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. - 8లో



విభుం విశ్వనాథం
శివరాత్రి నాడు ఈశుని అభిషేకానికి ఆకాశ గంగ సిద్ధమైంది. శ్రీకాకుళంలోని నాగావళి ఒడ్డున ఈ దృశ్యం సాక్షాత్కరించింది.

న్యూస్‌రీల్

నేటి నుంచే తైక్వాండో పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో ఆదివారం 12వ జిల్లాస్థాయి సబ్‌జూనియర్స్, కేడిట్, జూనియర్స్ తదితర విభాగాల్లో తైక్వాండో చాంపియన్ షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలోని సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా ఉదయం 9.30 నుంచి మొదలుకానున్నాయి. ఈ పోటీల ప్రారంభోత్సవానికి మాజీ డిప్యూటీ సీఎం, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను విజయవంతం చేయాలని తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కర్ కోరారు.

హత్య కేసులో నిందితుడు అరెస్ట్


- వివరాలు వెల్లడించిన సీఐ



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ పి. పైడియ్య

ఆమదాలవలస: ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి సొట్టవానిపేటలో శుక్రవారం జరిగిన హత్యకు సంబంధించి నిందితుడు కొలుసు రామారావును అరెస్ట్ చేసినట్లు ఆమదాలవలస సీఐ పి.పైడియ్య శనివారం విలేకరులకు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నిందితుడు రామారావు తన భార్య సూర్యంపై మూడేళ్లుగా అనుమానం పెంచుకున్నాడు. ఈ విషయంపై నిత్యం గొడవపడేవాడు. అయితే ఆమె తన మాట వినడం లేదనే కోపంతో ఏకంగా చంపడానికి నిశ్చయించుకున్నాడు. కుమార్తె కూడా తల్లి అక్రమ సంబంధానికి సహకరిస్తోందని భావించి వీరిద్దరినీ చంపాలని అనుకున్నాడు. అనుకున్నట్టుగానే వాలుపు కత్తిని సిద్ధం చేసుకున్నాడు. ఇద్దరు కొడుకులు తమ పనులపై బయటకు వెళ్లిపోయాక భార్యపై దాడికి తెగబడ్డాడు. ఈ ప్రయత్నంలో ఆమెకు కుడి చేయి, ఎడమచేతికి గాయాలయ్యాయి. ఆమెపై దాడి చేస్తుండగా కుమార్తె విజయ అడ్డు పడడంతో ఆమెపై కూడా దాడి చేయడంతో చనిపోయిందని సీఐ తెలిపారు. నిందితుడు హత్య చేసిన తర్వాత మెట్టక్కివలస–2 వీఆర్‌ఓ కె.శ్రీనివాసరావు వద్దకు వెళ్లి లొంగినట్లు తెలిపారు. వీఆర్‌ఓ నిందితుడిని పోలీసులకు అప్పగించగా, అతడిని అరెస్ట్ చేసి హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు. ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి, రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో హెచ్‌సీలు గోవిందరావు, అప్పారావు, కృష్ణారావులతోపాటు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు



ఎందువలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: నవధాన్యాలైన మినుములు, పెసలు, ఉలవలు, జొన్న, తోటకూర, కట్టె, కంది, ఉూదలు, రాగులు సాగు చేసుకుంటే భూతల్లి సారమవుతుందని సేంద్రియ ఎరువుల ట్రైనింగ్ మాస్టర్ శివ అన్నారు. శనివారం ఆనందపురం, ఎందువ గ్రామాల్లో నవ ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు మితిమీరి వాడటంతో భూమి సారం కోల్పోయి నాణ్యమైన పంటలను సాధించలేకపోతున్నామని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్ ముందు రైతులు నవధాన్యాల సాగు చేసుకుంటే మెరుగైన లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వలస సెక్టార్ ట్రైనర్ రమణమ్మ, రాజేష్, రాజేశ్వరి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు హేమంత్ కుమార్, యుంగధర్ పాల్గొన్నారు.

ఊరూ.. వాడా.. వెండికొండ



శ్రీకాకుళంలో ఓ భక్తురాలి తన్మయత్వం

చంద్రుడు రాని చీకటి వేళ శివ జాగరణ ఘనంగా జరిగింది. సూరీడు రాక మునుపు మొదలైన పంచాక్షర జపం నిరాటంకంగా కొనసాగింది. చినుకులకు తడుస్తూ, చలిగాలులకు వణుకుతూ, శీతల వాతావరణాన్ని ఆస్వాదిస్తూ భక్తకోటి ఇష్టదైవార్చన కోసం బారులు తీరింది. శివరాత్రి పుణ్యదినాన మారేడు దళాలతో మహాదేవుడిని పూజించింది. పంచామృతాలతో పరమేశ్వరుడిని అభిషేకించింది. విభూది రేఖలు ధరించి విశ్వనాథుడిని స్మరించి తరించింది. ఈ పవిత్ర ఘడియల్లో జిల్లాలోని శైవ క్షేత్రాలన్నీ కళకళలాడాయి. భక్తజనం మారేడు వనమై వికసించింది.

మల్లన్న సన్నిధి..భక్తకోటి పెన్నిధి



ఎండల మల్లికార్జునస్వామికి శీర్షాభిషేకాలు చేస్తున్న భక్తులు

టెక్కలి/టెక్కలిరూరల్: కలియుగ కైలాసంగా పేరుగాంచిన టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి శివరాత్రి నాడు భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచి మల్లన్నకు ప్రత్యేకంగా శీర్షాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ, సర్పంచ్ ఎస్.బాలకృష్ణ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎస్. సుధాకర్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నాగావళి ఒడిలో..

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలో నాగావళి ఒడ్డున ఉన్న బలరామ ప్రతిష్ఠిత ఉమారుద్ర కోటేశ్వర ఆలయం శివరాత్రి నాడు కళకళలాడింది. ఉదయం 3 గంటలకు ప్రథమార్చన సహిత పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తుల పేరున అభిషేకాలు, అర్చన జరిగాయి. రాత్రి 10 గంటల వరకు స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశవార మహారుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చనలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు.



ఉమారుద్రకోటేశ్వరుడికి అభిషేకం



భీముని ఆలయం వద్ద భక్తజన సందోహం

ఆ శిఖరాల్లో..

మందస: మహేంద్ర గిరి శిఖరాలు మహేశ్వరుని నామస్మరణతో మార్మోగాయి. ఇటు మందస అటు పర్లాకిమిడి వైపు నుంచి భక్తులు పెద్ద ఎత్తున కొండ నెక్కి శివరాత్రి జాతర నిర్వహించారు. ఒడిశా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పంచ పాండవుల ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఈ ఆలయాలను దర్శించుకున్న వారు మందస మండలంలోని పొత్తంగిలో పాత్తీశ్వరాలయాన్ని దర్శించుకున్నారు.



శ్రీకాకుళం: బలగ ఉత్తరేశ్వరుడు

మధుకేశ్వరా..



శ్రీముఖలింగంలో అర్ధరాత్రి నిర్వహించిన లింగోద్భవంలో పాల్గొన్న ఆలయ శాశ్వత ధర్మకర్త పర్లాకిమిడి మహారాణి కల్యాణి గజపతి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం హర నామ స్మరణతో మార్మోగింది. శనివారం వేకువ జాము మూడు గంటల నుంచి భక్తుల రాక ఆరంభమైంది. శని త్రయోదశి కావడంతోపాటు వర్షం కారణంగా భక్తుల సంఖ్య గత ఏడాది కంటే తగ్గింది. స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ దంపతులు, ఎస్పీ రాధిక దంపతులు, ఆర్డీఓ బి.శాంతి స్వామిని దర్శించుకున్నారు.



పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆలయ ఆవరణలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ దంపతులు

ప్రకృతి వ్యవ‘సాయం’

- ప్రకృతి సేద్యంపై పెరుగుతున్న ఆసక్తి
- తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం
- ఆరోగ్యకర ఉత్పత్తులకు ప్రజల్లో ఆదరణ

ఎచ్చెర్ల:

ప్రకృతి వ్యవసాయంపై అన్నదాతలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందించడానికి, భూముల సారాన్ని పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. దీంతో ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం గత ఏడాది కంటే 984 ఎకరాలు పెరిగింది. ఈ సాగు వల్ల ఖర్చులు తగ్గడం, దిగుబడులు పెరగటంతో రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ఎచ్చెర్ల మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. గత ఏడాది 2926 ఎకరాల్లో ఈ పద్ధతిలో సేద్యం చేయగా.. ఈ ఏడాది ఆ విస్తీర్ణం 3,910 ఎకరాలకు పెరిగింది. స్వయం సహాయక సంఘాల్లోని సభ్య రైతులతో పాటు ఇతర రైతులు కూడా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తున్నారు. మండలంలో కేశవరావుపేట, ఫరీదుపేట, ఎస్ఎం పురం, ధర్మవరం, పొన్నాడ, తమ్మినాడుపేట, కొత్తపేట, కొంగరాం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా సాగు చేస్తున్నారు. వీరంతా దాదాపు సన్న, చిన్నకారు రైతులే.



జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

సహజ ఎరువులతో..

ఈ పద్ధతిలో సహజ ఎరువులనే వాడుతూ పంటలను సాగు చేస్తారు. జీడిమామిడి పూతలపై పురుగుల నివారణకు, పూత నిలవడానికి మజ్జిగ, ఇంగువ, బెల్లం మిశ్రమ ద్రావణాన్ని, ఎరువుగా వాడటానికి ఆవుపేడ, బెల్లం, పప్పు దినుసుల పిండి, తగినంత గోమూత్రాన్ని కలిపి మిశ్రమంగా తయారుచేసిన ఉండలను పంటలకు ఎరువుగా వాడుతున్నారు. అలాగే వీటికి నీటిని కలిపి తయారుచేసిన ద్రవ జీవామృతాన్ని పంటలపై చీడ, పీడల నివారణకు, పంట బలంగా ఎదిగేందుకు వినియోగిస్తున్నారు. అగ్గి తెగులు నివారణకు మారేడు కషాయం, వరిలో సుడిదోమ నివారణకు రేడియో మొక్కల ఆకులతో తయారుచేసిన కషాయం, వైరస్ నివారణకు పేడ కషాయం, పురుగుల నివారణకు నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం వంటి కషాయాలను వినియోగిస్తూ పంటలను పండిస్తున్నారు. వీటిని కొందరు రైతులు స్వయంగా తయారు చేసుకుంటున్నారు. మరికొందరు ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటుచేసిన మినీ దుకాణాల ద్వారా కొనుగోలు చేసుకుని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు.

పూర్తిస్థాయిలో..



ఎచ్చెర్ల మండలంలోని 22 పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ సాగు చేస్తున్నారు. మిగిలిన వారు పాక్షికంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి వ్యవసాయం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయానికి కృషి చేస్తున్నాం. రైతుల్లో నమ్మకం పెరగటం వల్ల గత ఏడాది కంటే ఈ సారి సాగు విస్తీర్ణం పెరిగింది.
– సీహెచ్ సూర్యనారాయణ, (ఎస్‌డీపీ) ప్రకృతి వ్యవసాయం



ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు

సంగీత పరికరాల శృతికర్తలు



- 50 ఏళ్లుగా సంగీత పరికరాలు తయారీ
- తంత్రీ, చర్మ వాయిద్యాల తయారీలో దాస్ బ్రదర్స్

ఇచ్ఛాపురం రూరల్/ఇచ్ఛాపురం:

అర్ధ శతాబ్ద కాలంగా ఆ వీధిలో స్వర ధార ప్రవహిస్తోంది. శృతులను సరిచేస్తూ.. గతులను పలికిస్తూ రాగ వాహిని పరవళ్లు తొక్కుతోంది. సాధారణంగానే ఇచ్ఛాపురం అందంగా ఉంటుంది. స్వేచ్ఛావతి అమ్మవారిని కనులారా దర్శించుకున్నాక అలా రైల్వేస్టేషన్ దారిలో తిరుగాడాలి. మున్సిపాలిటీ ఆఫీసు వీధిలో తిరుగుతూ దాస్ బ్రదర్స్ సంగీత పరికరాల దుకాణం వైపు దృష్టి సారించాలి. జబ్బు పడి వచ్చిన వాయిద్యాలకు అక్కడ చికిత్స లభిస్తుంది. కొత్త పరికరాలు పురుడు పోసుకుంటూ ఉంటాయి. పాతవి కొత్త ఊపిరి అందుకుంటూ ఉంటాయి. ఇద్దరు విశ్రాంత ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఈ అంగడి వాయిద్యాలకు వైద్యం అందిస్తోంది.



అమ్మకాలకు సిద్ధం చేసిన వాయిద్యాలు

పట్టణంలోని కంద్రవీధికి చెందిన కిరమణి దాస్ ఉత్కళాంధ్రలో పేరు సంపాదించిన సంగీత విద్వాంసులు. ఆయన వద్ద వందలాది మంది సంగీతాన్ని నేర్చుకున్నారు. ఆయనే స్వయంగా సంగీత పరికరాలు తయారు చేసేవారు. ఆయన వారసత్వాన్ని ఇద్దరు కుమారులు దుక్ శ్యామ్‌దాస్, దేవేంద్రదాస్‌లు నిలబెడుతున్నారు. వీరిద్దరూ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. అయినా సంగీతం చూపిన దారిని విడిచి పెట్టలేదు. ఇంటి వద్దనే సంగీత పాఠాలు చెబుతూ, పరికరాల తయారీ, విక్రయం కూడా చేస్తున్నారు. ముర్దంగి, మృదంగం, తబలా, మద్దిల, డోలక్, డోలు వంటి సంగీత వాయిద్యాలను తయారీ చేసేందుకు నాణ్యమైన టేకు, గుమ్మడి, పనస కర్రలను వినియోగిస్తుంటారు. అన్నింటి కంటే ప్రధానంగా హార్మోనియం తయారీలో వీరిది అందె వేసిన చేయి. ముఖ్యంగా సింగిల్ రీడ్ హార్మోనియం, డబుల్ రీడ్ హార్మోనియం, త్రిపుల్ రీడ్ హార్మోనియం, లెగ్ హార్మోనియం, మౌత్ హార్మోనియం, రీడ్ వెర్టికల్ బోర్డ్స్ తదితర రకాలు తయారు చేస్తున్నారు.



మద్దిలి తయారీ చేస్తున్న వర్కర్లు

సంగీతంపై మక్కువతోనే..



మా నాన్న సంగీత విద్వాంసులు, ఒరియా కవి. ఆయన వద్ద అప్పట్లో ఆంధ్రా, ఒడిశాకు చెందిన వందలాది మంది కళాకారులు సంగీతాన్ని నేర్చుకున్నారు. నేను, మా అన్నయ్య టీచర్లుగా పనిచేస్తూనే సంగీతం నేర్చుకున్నాం. సంగీత పరికరాల మరమ్మతులు, కొనుగోలుకు అప్పట్లో విశాఖ వెళ్లే వారు. అందుకే మేమే దుకాణం ఏర్పాటు చేశాం. సొంతంగా వర్క్‌షాప్ నిర్వహిస్తూ వాయిద్యాలను తయారు చేస్తున్నాం.
– దేవేంద్రదాస్, సంగీతం మాస్టార్, వర్క్‌షాప్ యజమాని

డిమాండ్ ఫుల్

50 ఏళ్లుగా మూడు తరాలకు చెందిన వారంతా సంగీత వాయిద్య వస్తువులను తయారు చేస్తున్నాం. సంగీతం యాప్‌లు, ఎలక్ట్రానిక్ మ్యూజిక్ పరికరాలు వచ్చినా మాకు మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. సంగీత పరికరాల తయారీకి కావాల్సిన ముడి సరుకును మేము కోల్‌కతా, ఢిల్లీ, బనారస్ ప్రాంతాల నుంచి తెప్పిస్తుంటాం. ముఖ్యంగా హార్మోనియం తయారీలో బిజీబిజీగా ఉంటాం. మరమ్మతులు కూడా చేస్తుంటాం. నెలకు సుమారు రూ. 50వేల వరకు ఆదాయం వస్తుంది.
– నిర్మల్ కుమార్‌దాస్, సంగీత వాయిద్యాల తయారీదారుడు



హార్మోనియం పెట్టెను తయారు చేస్తూ..

క్లుప్తంగా

నేడు కవితా నిలయం లోగో ఆవిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని శాంతిని కేతన్ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉదయం 10 గంటలకు యువ చిత్రకాళకారుడు ఎం.యుగంధర్ చిత్రించిన కవితా నిలయం లోగో ఆవిష్కరణ సభ, కవితా సమీక్ష జరుగుతుందని అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈ వేమన) ఒక ప్రకటనలో తెలిపారు. వి.రాజారావు రచించిన 'మహోన్నత శిఖరాలు' కవితా సంపుటిపై సమీక్ష ఉంటుందని, కవితాభిమానులు హాజరుకావాలని కోరారు.

రెయ్యిపేటలో విచారణ



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎంఈఓ

టెక్కలి: టెక్కలి మండలం రెయ్యిపేట లో శనివారం విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలో పాఠశాలకు ఉపాధ్యాయుడు సక్రమంగా విధులకు హాజరుకావడం లేదంటూ గ్రామస్తులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంఈఓ డి.నాగభూషణరావు గ్రామానికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఉపాధ్యాయుడు వాసును పెద్దభీంపురం పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు. మోదుగువలస పాఠశాల ఉపాధ్యాయుడికి రెయ్యిపేట పాఠశాల బాధ్యతలు అప్పగించారు.

క్యాన్సర్ బాధితునికి సాయం



చిన్నవాడుకుకు ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

టెక్కలి రూరల్: మండంలోని నర్సింగపల్లి గ్రామానికి చెందిన రాంబాబు చారిట్రబుల్ ట్రస్ట్ సభ్యులు ఔదార్యం చాటుకున్నారు. అదే గ్రామానికి చెందిన పద్మ చిన్నవాడు క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో చికిత్స కోసం రూ.59 వేల విరాళాలు సేకరించి శనివారం అందజేసినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు ఎన్ని షణ్ముఖరావు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భూహక్కు ప్రత్యేకాధికారి సుబ్బారావు



సుబ్బారావుకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర జగనన్న భూహక్కు భూరక్షణ స్పెషల్ ఆఫీసర్, ఐఏఎస్ అధికారి బి.సుబ్బారావు కుటుంబసమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈఓ వి.హరిసూర్యప్రకాష్ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తీర్థ ప్రసాదాలు అందజేసారు. ఈయన వెంట తహశీల్దార్ వెంకటరావు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారి బెహరా గణేష్ ఉన్నారు.

గాయపడిన మహిళ మృతి

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి గ్రామానికి చెందిన మల్లిపెద్ది రమ (48) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. భర్త రమణమూర్తి తెలిపిన వివరాల మేరకు.. రమణ జాడుపల్లి మండల పరిషత్ పాఠశాల పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. మంగళవారం విద్యార్థులకు వంట చేస్తున్న సమయంలో చీరకు నిప్పంటుకుని గాయపడింది. వెంటనే బాధితురాలిని టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించి వైద్యమందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. భర్త రమణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెళియాపుట్టి పోలీసులు కేసు నమోదు చేశారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹95	₹160	₹ 170

ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో..

మార్పులు.. చేర్పులు

- కొత్తగా నాలుగు కార్యాలయాలు మంజూరు
- జిల్లాలో 16కు చేరిన ప్రాజెక్టులు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం



కోటబొమ్మాళి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం

ప్రాజెక్టు కార్యాలయం	పరిధిలోని మండలాలు
ఆమదాలవలస	ఆమదాలవలస, ఆమదాలవలస(మున్సిపాలిటీ), పొందూరు
బూర్జ	బూర్జ, సరుబుజ్జిలి
ఎచ్చెర్ల	ఎచ్చెర్ల, జి.సిగడాం
రణస్థలం	రణస్థలం, లావేరు
గార	గార, శ్రీకాకుళం(రూరల్)
శ్రీకాకుళం(అర్బన్)	శ్రీకాకుళం(అర్బన్)
సారవకోట	సారవకోట, జలుమూరు
నరసన్నపేట	నరసన్నపేట, పోలాకి
కోటబొమ్మాళి	కోటబొమ్మాళి, సంతబొమ్మాళి
టెక్కలి	టెక్కలి, నందిగాం
పాతపట్నం	పాతపట్నం, మెళియాపుట్టి
కొత్తూరు	కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట
పలాస	పలాస, కాశీబుగ్గ, వజ్రపుకొత్తూరు
మందస	మందస
సోంపేట	సోంపేట, కంచిలి
ఇచ్ఛాపురం	కవిటి, ఇచ్ఛాపురం(అర్బన్)

కోటబొమ్మాళి: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో మార్పులు..చేర్పులు చోటుచేసుకున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది అభ్యర్థనల మేరకు ప్రస్తుతం ఉన్న 13 ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల(ఉమ్మడి జిల్లాలో 15)లో మండలాలను మార్పు చేశారు. జిల్లాలో కొత్తగా సోంపేట, పాతపట్నం, బూర్జ, ఎచ్చెర్లలో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాలను మంజూరు చేసింది. కొన్ని మండలాలను కొత్త ప్రాజెక్టు కార్యాలయాలకు అనుగుణంగా చేర్పులు చేసింది. దీంతో మొత్తంగా జిల్లాలో కొత్తవి, పాతవి కలిపి మార్చిలో 16 ఐసీడీఎస్ కార్యాలయాలు ఏర్పాటుకానున్నాయి. ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో విధుల నిర్వహణ జరపనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర ఈ నెల 8న జీఓ-2 విడుదల చేశారు. తదుపరి ఏర్పాట్లు చేయాలంటూ ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకే..

జిల్లాల పునర్విభజనలో భాగంగా పరిపాలన సౌలభ్యం కోసం ఉమ్మడి జిల్లాలోని 15 ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో మండలాలను మార్పులు, చేర్పులు చేశాం. కొత్త కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఇటీవలే ఆమోదం లభించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం. మార్చిలో మొత్తం 16 కార్యాలయాలు ఏర్పాటుచేస్తాం.

– అనంతలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, శ్రీకాకుళం

యువకుడి అనుమానాస్పద మృతి



ఇనపకుర్తి శ్రీధర్(ఫైల్)

లావేరు: మండలంలోని లావేటిపాలెం గ్రామానికి చెందిన ఇనపకుర్తి శ్రీధర్(25) తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా బీబీనగర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలుపట్టాలపై అనుమానాస్పదంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీధర్ పేపరు ప్లేట్లు తయారు చేసే మిషన్లు రిపేర్ చేయడం, అమ్మకాలు చేపట్టడం వంటి పనులు చేస్తున్నాడు. ఈ నెల 15న విజయవాడలో బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. అక్కడి నుంచి ఈ నెల 17న సాయంత్రం 5.40 గంటల సమయంలో తండ్రికి ఫోన్ చేసి పేపర్ ప్లేట్ మిషన్ పనిమీద హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడు. నల్గొండ, హైదరాబాద్ ప్రాంతాల్లో ఉంటున్న లావేటిపాలెం గ్రామానికి చెందిన స్నేహితులకు సైతం ఫోన్ చేసి రాత్రి 7.30 గంటలకు వస్తున్నట్లు సమాచారం అందించాడు. రాత్రి 8 గంటలైనా శ్రీధర్ రాకపోవడంతో స్నేహితులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. వెంటనే విషయాన్ని శ్రీధర్ తండ్రి తిరుపతిరావు, సోదరుడు దొరబాబుకు తెలియజేయగా వారు ప్రయత్నించినా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. చార్జింగ్ అయిపోవడం గానీ, రైలుతో ఫోన్ పోవడం గానీ జరిగి ఉంటుందని భావించారు. శ్రీధర్ మృతదేహం బీబీనగర్ రైల్వే ట్రాక్‌పై ఉన్నట్లు శనివారం ఉదయం లావేరు పోలీస్ స్టేషన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో అంతా విషాదంలో మునిగిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి బయలుదేరివెళ్లారు. పోస్టుమార్టం చేయించి మృతదేహాన్ని లావేటిపాలెం తీసుకువస్తున్నారు. కాగా, మృతికి గల కారణాలు స్పష్టంగా తెలియకపోవడంతో కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు.

20న సామూహిక ధర్నా



రిలే నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం రెండోడిపోలో సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ యాజమాన్యం స్పందించని కారణంగా ఈ నెల 20న శ్రీకాకుళం డీపీటీఓ కార్యాలయం వద్ద సామూహిక ధర్నా చేపట్టనున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో 15వ రోజైన శనివారం రిలే నిరాహారదీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ యూనియన్ శ్రీకాకుళం రెండో డిపో కార్యదర్శి కె.బాబూరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులపై పనిభారం పెంచడం తగదన్నారు. రెస్టాఫ్ డ్యూటీలు రద్దు చేసి ఓటీ డ్యూటీలు చేయించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. రిలే దీక్షలో జేఏసీ నాయకులు కె.సూర్యప్రకాశరావు, పి.రంగారావు, ఎల్.ఎస్.నారాయణ, ఎ.కృష్ణారావు, జి.భాస్కరరావు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

22న ద్విచక్ర వాహన వేలం

శ్రీకాకుళం క్రైం: స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ నెల 22న ఉదయం 10.30 గంటలకు ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు సీఐ సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

'తూర్పుకాపులకు ప్రాధాన్యమివ్వాలి'



మాట్లాడుతున్న పిసిని చంద్రమోహన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లాలో తూర్పుకాపులు అధికంగా ఉన్నందున స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యధిక జనాభా కలిగిన తూర్పు కాపు సామాజిక వర్గానికి జిల్లాలో ఎమ్మెల్సీ స్థానం కేటాయించకపోవడం ఆశ్చర్యానికి గురి చేసిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వంలో భాగస్వాములుగా చేశారని, ఎమ్మెల్సీ విషయంలోనూ తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన వారికి ప్రాధాన్యమిచ్చి సముచిత స్థానం కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఐటీకేఎస్ఎస్ స్టీరింగ్ కమిటీ కో కన్వీనర్ కద్దాల శ్యామసుందరరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కరిమజ్జి మల్లేశ్వరరావు, జిల్లా సంఘ అధ్యక్షుడు కోయిలాపు శ్రీనివాసరావు, ఆమదాలవలస అధ్యక్షుడు ఇప్పిలి శ్రీనివాసరావు, జిల్లా నేత వావిలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భాగ్యలక్ష్మి బోనాల పండగ



బోనాలు సమర్పిస్తున్న భక్తులు



భాగ్యలక్ష్మి పేరంటాలు

జి.సిగడాం: మండలంలోని వెంకయ్యపేటలో భాగ్యలక్ష్మి పేరంటాల ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా శనివారం అంగరంగ వైభవంగా బోనాలు సమర్పించారు. ఈ నెల 16 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆఖరి రోజు కావడంతో భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, సర్పంచ్ మామిడి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్

- ముగ్గురికి గాయాలు



ప్రమాద ఘటనలో నుజ్జయిన వాహనం

ఎచ్చెర్ల క్యాంపస్: మండల పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారిపై తమ్మినాయుడుపేట పంచాయతీ సనపలవానిపేట సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పలాసకు చెందిన కవిటి శాంతారావు(డ్రైవర్), అన్నెపు రాకేష్, బృందావతిలు విశాఖపట్నం నుంచి ఫర్నిచర్, గృహ సామగ్రితో సొంత ప్రాంతానికి బయలుదేరారు. శ్రీకాకుళం వైపు వెళుతూ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వ్యాన్ బోల్తా పడింది. ముందుభాగం నుజ్జునుజ్జు కావడంతో స్థానికులు 108, పోలీసులకు సమాచారం అందించారు. రిస్క్యూ టీం అధికారి ఎం.వరప్రసాద్ ఆధ్వర్యంలో బృందం చేరుకుని ముగ్గురినీ సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రాణాపాయం నుంచి బయటపడ్డ వీరంతా చికిత్స పొందుతున్నారు. ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడి మృతికి సంతాపం



వై.వి.రావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఈయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామ్రేడ్ వై.వి.రావు అకాల మరణం ఆర్టీసీకి, యూనియన్‌కు తీరని లోటని సంఘ నాయకులు పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఈయూ కార్యాలయ ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ వై.వి.రావు యూనియన్ రాష్ట్ర అధ్యక్షునిగా సుదీర్ఘ కాలం పనిచేసి, నిస్వార్థంగా సేవలందించారని కొనియాడారు. అమరావతి జేఏసీలో కీలక పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో యూనియన్ జోనల్ కార్యదర్శి భాసూరి కృష్ణమూర్తి, గౌరవ అధ్యక్షుడు ఎస్ఎస్ఆర్ శర్మ, ముఖ్య సలహాదారు కొర్లాం గణేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గునాపు త్రినాథరావు, శ్రీకాకుళం ఒకటో డిపో సెక్రటరీ ఎస్.వి.రమణ, రెండో డిపో సెక్రటరీ కె.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కొండబారిడ దళం పేరుతో లేఖలు



విడుదలైన లేఖ

కొత్తూరు: మండలంలోని కొందరు అధికారులు అవినీతి చేస్తున్నారంటూ రైతాంగ పోరాట కమిటీ కొండబారిడ దళం కార్యదర్శి భాస్కరరావు పేరుతో కొత్తూరు మండలంలోని పలువురు విలేకరులకు పోస్టల్ ద్వారా శనివారం ఉత్తరాలు అందాయి. కొత్తూరు గ్రామ సచివాలయం-1లో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులతో పాటు రెవెన్యూ కార్యాలయానికి చెందిన అధికారి, ఓ వ్యక్తి కలిసి భూముల రీ సర్వే సందర్భంగా రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు అందులో పేర్కొని ఉంది. ఈ వ్యవహారంలో ప్రమేయమున్న వారికి ప్రజాకోర్టులో కఠిన దండన విధించాలని తీర్మానించినట్లు లేఖలో హెచ్చరించారు. మిగిలిన వారికి కూడా శిక్ష విధిస్తామని తెలిపారు. దశాబ్దాల తర్వాత ఇలాంటి లేఖ రావడం ఈ ప్రాంతంలో సంచలనంగా మారింది. ఈ లేఖ నిజమైనదా కాదా అన్న విషయం తేలాల్సి ఉంది.

జాతీయ కౌన్సిల్ సభ్యునిగా సింహాచలం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కోల్‌కతాలో ఈ నెల 15 నుంచి 18 వరకు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన గంగరాపు సింహాచలం జాతీయ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదలైంది.